సాక్షి తిరుపతి

గురువారం । 1 । జూన్ । 2023



పారదర్శకంగా పోలీసులకు కౌన్సెలింగ్

జిల్లాలో ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న పోలీసులకు బుధవారం బదిలీలపై ఎస్పీ పరమేశ్వరరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. - 8లో



పండుగలా చంద్రగిరి ఐపీఎల్

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్ పోటీలను ఎంపీ మిథున్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	39	28
చిత్తూరు	38	27
తిరుమల	34	23
గూడూరు	41	30
నగరి	39	28

న్యూస్‌రీల్

అమృత్ సరోవర్ పనులు వేగవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : జిల్లాలో అమృత్ సరోవర్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఉపాధి సిబ్బందితో వర్చువల్ సమావేశం నిర్వహించారు. అమృత్ సరోవర్ కింద నిర్దేశిత చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. ఉపాధి పథకం కింద రోజుకు రూ.260 మాత్రమే వచ్చేలా పనులు చూపుతున్నారని, కనీసం రూ.272 వరకు పని కల్పించాలని సూచించారు. ఈ వారం జిల్లావ్యాప్తంగా 1.25 లక్షల మందికి కూలి పనులు కేటాయించాలని స్పష్టం చేశారు. ప్రతి వారం ఇందులో పురోగతి చూపించాలని తెలిపారు. 7,346 జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయించాలని కోరారు. సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి–రాయచోటికి ఏసీ బస్సు

తిరుపతి అర్బన్ : తిరుపతి–రాయచోటి మధ్య గురువారం నుంచి ఇంద్ర ఏసీ బస్సును నడపనున్నట్లు మంగళం డిపో మేనేజర్ భాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ బస్సు ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు తిరుపతిలో బయలుదేరి 9.40కి రాయచోటికి చేరుకుంటుందన్నారు. మళ్లీ 11 గంటలకు రాయచోటిలో బయలుదేరి మధ్యాహ్నం 1.30కి తిరుపతికి వస్తుందని వెల్లడించారు. అలాగే పౌర్ణమిని పురస్కరించుకుని తిరువణ్ణామలైకు జూన్3వ తేదీన 13 సర్వీసులను నడపనున్నట్లు వివరించారు. సమాచారం కోసం 9959225684, 99592 25686 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధ రాత్రి వరకు 75,871 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,859 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.27 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు లిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది.

బాణసంచా గోదాము యజమాని అత్యాశ మూడు కుటుంబాల్లో విషాదం నింపింది.. లైసెన్స్ కాలపరిమితి ముగిసినా పట్టించుకోని అధికారుల అలసత్వం పేద బతుకులను ఛిద్రం చేసింది.. పొట్ట పోషణకు వెళ్లి మాంసపు ముద్దలుగా మారిన కూలీల మృతదేహాలను చూసి బాధిత కుటుంబీకుల రోదన వర్ణనాతీతంగా మారింది.. గాయపడిన వారి ఆర్తనాదాలతో ఘటనాస్థలం హృదయవిదారకంగా తయారైంది.. నిబంధనలకు విరుద్ధంగా టపాకాయలు తయారుచేస్తున్నా చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.. అక్రమంగా పేలుడు పదార్థాలను నిల్వ చేస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదంలో కాలిపోయిన మోటారు బైకులు

పొట్టకూటికి వెళ్లి.. మృత్యుపాశంలోకి..

- బాణసంచా గోదాములో అగ్నిప్రమాదం
- ముగ్గురు కూలీల దుర్మరణం
- కనీస జాగ్రత్తలు పాటించని యజమాని
- లైసెన్సుకు ముగిసిన కాలపరిమితి
- అధికారుల నిర్లక్ష్యమే ఘటనకు కారణం

వరదయ్యపాళెం : అనధికారికంగా నిర్వహిస్తున్న బాణసంచా గోదాములో బుధవారం సంభవించిన అగ్నిప్రమాదం మూడు కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. ప్రభుత్వ అనుమతి లేకుండా రూ.లక్షల విలువైన పేలుడు సామగ్రిని నిల్వ చేసి, టపాకాయలను తయారు చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వరదయ్యపాళెం మండలం కువ్వాకొల్లి పంచాయతీ ఎల్లకట్టవ గ్రామ సమీపంలో ఉన్న టపాకాయల తయారీ గోదాములో పేలుడు ఘటన అధికార యంత్రాంగానికి ముచ్చెమటలు పట్టిస్తోంది.

ఉపాధి కోసం వెళ్లి..

గూడూరుకు చెందిన ఏడుకొండలు, కువ్వాకొల్లికి చెందిన ఎ.నాగేంద్ర, ఎల్లకట్టవకు చెందిన శంకరయ్య, కల్యాణ కుమార్‌వి రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు. వీరు టపాకాయల తయారీ ద్వారా కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం టపాకాయల గోదాములో పనికి వెళ్లారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో గోదాము ఎదుట వేప చెట్టు కింద ఆరుబయట టపాకాయల తయారీ చేస్తుండగా ఒక్కసారిగా అగ్నిప్రమాదం సంభవించింది. గోదాము ఎదుట టపాకాయలు నిల్వ చేసిన తాటాకుల షెడ్‌కు మంటలు అంటుకున్నాయి. అందులోని నల్ల మందు, టపాకాయలు ఒక్కసారిగా పేలడంతో అక్కడే పనిచేస్తున్న ఏడుకొండలు, నాగేంద్ర, శంకరయ్య అక్కడికక్కడే మరణించారు. వారి మృతదేహాలు మాంసపు ముద్దలుగా మారిపోయాయి. సమీప పొలాల్లో చెల్లాచెదురుగా పడ్డాయి. గోదాము యజమాని వీరరాఘవులు, కల్యాణ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తికి తరలించగా అక్కడ వైద్యుల సలహా మేరకు తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

జాతర కోసమే..

సూళ్లూరుపేట సమీపంలోని మన్నెముద్దూరులో జరగనున్న జాతర కోసం గోదాము యజమాని వీరరాఘవులు టపాకాయల ఒప్పందం కుదుర్చుకున్నాడు. భారీ మొత్తంలో తీసుకున్న కాంట్రాక్టు మేరకు బాణసంచా తయారీ చేపట్టాడు. అందుకే మార్చి 31వ తేదీ నాటికే గోదాము నిర్వహణ లైసెన్స్ గడువు ముగిసినా,అక్రమంగా టపాకాయలు తయారు చేయిస్తున్నాడు.

భార్య ప్రసవ సమయంలోనే..

ప్రమాదంలో మృతి చెందిన ఎ.నాగేంద్ర భార్య నిండు గర్భిణి. ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లింది. ఇలాంటి సమయంలో భర్త మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. వారికి ఇప్పటికే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అలాగే గూడూరుకు చెందిన ఏడుకొండలుది నిరుపేద కుటుంబం. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో భార్య, ఇద్దరు పిల్లలు ఆవేదన చెందారు.

కనీస భద్రత కరువు!

గోదాములో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితే కానీ అధికారులు స్పందించరని, ముందస్తు తనిఖీ నిర్వహించి ఉంటే ఇప్పుడు మూడు ప్రాణాలు పోయేవి కాదని ఆవేదన చెందుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా తయారీ, విక్రయాలు సాగుతున్నా గోదాము యజమానిపై చర్యలు తీసుకోలేదని మండిపడుతున్నారు.

శవ పంచనామాకు అభ్యంతరం



గోదాము వద్ద విచారణ చేపట్టిన పోలీసులు

మృతదేహాలను శవపంచనామా నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ముగ్గురు వ్యక్తులు బలైయ్యారని, వారి కుటుంబాలకు దిక్కెవరంటూ ప్రశ్నించారు. మృతదేహాల తరలింపునకు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలీసులు నచ్చజెప్పి మృతదేహాలను తరలించారు. పేలుళ్ల ఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేపడుతామని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని తెలిపారు. అనధికారికంగా గోదా ము నిర్వహణ, పేలుడు పదార్థాలు నిల్వ ఉంచడం తదితర విషయాలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేయిస్తామని తెలిపారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పందించారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.కలెక్టర్, ఆర్డీఓకు ఫోన్ చేసి తగు చర్యలు చేపట్టాలని కోరారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

హనుమ వాహనా..గోవిందా



హనుమంత వాహనంపై ఊరేగుతున్న గోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం స్వామివారు వరద హస్తంతో హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు మాడ వీధుల్లో విహరించారు. గజ రాజులు ముందు నడుస్తుండగా, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో విశేషంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆలయంలో వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి గజ వాహన సేవ జరిపించారు. సర్వాంగసుందరరూపుడైన అనంతతేజోమూర్తి గజవాహనదారుడై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, కంకణభట్టార్ ఏపీ శ్రీనివాస దీక్షితులు, డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ రవికుమార్, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.25కోట్లు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో హుండీ ద్వారా రూ.1,25,40,111 ఆదాయం వచ్చినట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. బుధవారం ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ లెక్కింపు చేపట్టామన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఈ ఆదాయం వచ్చినట్లు వివరించారు.

దయజూపరు!

తిరుపతి ఎస్వీ జూపార్క్‌లో జంతువుల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. పర్యవేక్షణ లోపంతో తరచూ అనారోగ్యానికి గురవుతున్నాయి.. అధికారుల పట్టించుకోకపోవడంతో కొన్ని మరణిస్తున్నాయి.. రెండు రోజుల క్రితం ఓ పులిపిల్ల మృతి చెందితే వార్తను గుట్టుగా తొక్కిపెట్టడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. సంరక్షణ పేరుతో ఇరుకు గదిలోకి నెట్టేయడంతోనే పులిపిల్ల ఆరోగ్యం దెబ్బతిన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఎస్వీ జూపార్క్‌లో అధికారుల నిర్లక్ష్యం
- వసతుల కల్పనలో అడుగడుగునా అలసత్వం
- జంతువుల సంరక్షణపై పర్యవేక్షణ శూన్యం
- ఇరుకు గదిలో ఉంచడమే పులిపిల్ల మృతికి కారణం



తిరుపతి మంగళం : ఎస్వీ జంతు ప్రదర్శనశాల (జూపార్క్)కు నిత్యం పెద్దసంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. శ్రీవారి దర్శనార్థం వచ్చేవారితోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. జూ పార్క్‌లక్ష సుమారు 1,100 రకాల జంతువులు, పక్షులు ఉన్నాయి. వీటి ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించడంలో మాత్రం అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పెరిగిన ఎండ తీవ్రత నేపథ్యంలో జంతువులు ఉపశమనం పొందేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో అలసత్వం చూపినట్లు తెలుస్తోంది.

పాపం పులిపిల్లలు!

ఆత్మకూరు జూ నుంచి మార్చి 10వ తేదీన నాలుగు పులిపిల్లలను తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు తీసుకువచ్చారు. ఇక అప్పటి నుంచి వాటిని సంరక్షణ పేరుతో గాలి, వెలుతురు సక్రమంగా లేని చిన్నపాటి గదిలో ఉంచేశారు. సాధారణంగా జంతువులను ఇతర ప్రాంతాల నుంచి జూపార్క్‌కు తీసుకువచ్చినప్పుడు ఒక నెలపాటు పర్యవేక్షణ గదిలో ఉంచి, తర్వాత ఎన్‌క్లోజర్స్‌లోకి వదులుతుంటారు. అయితే పులి పిల్లలను మాత్రం ఇరుకు గదిలోనే ఉంచేయడంతో అవి మానసికంగా కుంగిపోయినట్లు తెలుస్తోంది. ఆ క్రమంలో ఒక పులిపిల్ల అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు సమాచారం. పులి పిల్లలను నిత్యం పర్యవేక్షించే వైద్యుడు సైతం వాటిని ఎన్‌క్లోజర్స్‌లోకి మార్చాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, జూ క్యూరేటర్‌కు సూచించినా పట్టించుకోనట్లు తెలిసింది. వారి నిర్లక్ష్యం కారణంగా పులి పిల్ల మరణించినట్లు వన్యప్రాణి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇటీవల ఒక నెమలి, రెండు బూడిదరంగు కోళ్లు కూడా మృత్యువాత పడినట్లు సమాచారం.

పక్కాగా పర్యవేక్షిస్తున్నాం

ఎస్వీ జూలోని జంతువుల ఆరోగ్య స్థితిగతులు, వాటి ఆహార ఏర్పాట్లను పక్కాగా పర్యవేక్షిస్తున్నాం. పులి పిల్లలను ఇక్కడకు తీసుకొచ్చినప్పటి నుంచి వాటిని జాగ్రతగా చూసుకుంటున్నాం. వాటిని నిత్యం జూ డాక్టర్ పరిశీలిస్తూనే ఉంటారు. రోజూ చికెన్, పాలు ఆహారంగా ఉందిస్తున్నాం. అయినప్పటికీ ఒక పిలి పిల్ల రెండు రోజుల క్రితం మృతి చెందింది. పోస్ట్‌మార్టం నిర్వహించినప్పుడు ఊపిరితిత్తులు, కిడ్నీ సమస్యతో పులిపిల్ల మరణించినట్లు తెలిసింది. ఎండ తీవ్రతకు అనుగుణంగా జంతువులకు వసతులు కల్పిస్తున్నాం.

– సెల్వం, ఎస్వీ జూ క్యూరేటర్, తిరుపతి

సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ పరిశీలన

రేణిగుంట : స్వచ్ఛ సంకల్పంలో భాగంగా రేణిగుంటలో ఏర్పాటు చేసిన సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్‌ను బుధవారం డీఆర్‌డీఏ ఏపీడీ మాధవి పరిశీలించారు. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టు కింద రేణిగుంట, తిరుచానూరును ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపీడీఓ హరిబాబు, ఈఓ పీఆర్డీ వెంకటరత్నమ్మ, సర్పంచ్ నగేశం, ప్రభాకర్, మస్తాన్ పాల్గొన్నారు.

గుండ్లగుట్టపల్లెలో ఏనుగు హల్‌చల్

పాకాల : మండలంలోని గుండ్లగుట్టపల్లె సమీపంలో ఓ ఏనుగు మంగళవారం అర్ధరాత్రి హల్‌చల్ చేసింది. మామిడి, అరటి, బీర తోటలను నాశనం చేసినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగును అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 191 మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కపిలతీర్థంరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం 27,001 నుంచి 43 వేల ర్యాంకు వరకు పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 191 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు ప్రిన్సిపల్, పాలి సెట్ కో–ఆర్డినేటర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. గురువారం 43,001 నుంచి 59 వేల ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురువారం నుంచి ప్రారంభం కావాల్సిన వెబ్ ఆప్షన్ ప్రక్రియ వాయిదా పడిందని, త్వరలోనే మరో తేదీని ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజును చెల్లించేందుకు గడువును పెంచినట్లు తెలిపారు.

పండుగలా చంద్రగిరి ఐపీఎల్

- తండ్రికి తగ్గ తనయుడు మోహిత్‌రెడ్డి
- ప్రపంచ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్
- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



క్రీడాకారులకు ప్రధానం చేసే మెడల్స్, ట్రోఫీలను పరిశీలిస్తున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి



పోటీల్లో పాల్గొన్న జట్లకు అందిస్తున్న క్రికెట్ కిట్‌ను పరిశీలిస్తున్న మిథున్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలో పండుగలా చంద్రగిరి ఐపీఎల్ నిర్వహిస్తున్నారని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశంసించారు. అసాధ్యాలను సుసాధ్యం చేయగల సత్తా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి మాత్రమే ఉందన్నారు. బుధవారం చంద్రగిరి ఐపీఎల్ పోటీలను ఆయన సందర్శించారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎదిగారని, 15వేల మంది యువకులను ఒకే వేదిక పైకి తీసుకురావడం సామాన్యమైన విషయం కాదని తెలిపారు. గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు ఖర్చుకు వెనకాడకుండా అద్భుతంగా క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విజయానికి ఢోకా లేదని, ఆయనకు యువత అండదండలు ఉన్నాయని స్పష్టం చేశారు. అతి చిన్న వయస్సులో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన మోహిత్ రెడ్డికి అఖండ మెజారిటీ చేకూర్చాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టోర్నమెంట్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో కలిసి ఓపెన్ టాప్ జీపులో 13 క్రీడా మైదానాలను సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారితో కలిసి సరదాగా క్రికెట్ ఆడారు. అనంతరం క్రీడాకారులకు ఉచితంగా అందిస్తున్న భోజన వసతులను పరిశీలించారు.

హోరాహోరీగా మ్యాచ్‌లు

వైఎస్‌ఆర్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌లో బుధవారం నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. పెద్దసంఖ్యలో ప్రేక్షకులు తరలిరావడంతో మైదానాలు కిక్కిరిసిపోయాయి. మ్యాచ్‌ల్లో అద్భుత ప్రతిభ చూపిన క్రీడాకారులకు మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి అవార్డులను ప్రదానం చేశారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ మిథున్‌రెడ్డి



బ్యాట్ పట్టి సరదాగా క్రికెట్ ఆడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి



క్రీడాకారులకు అందిస్తున్న భోజనాలను పరిశీలిస్తూ..



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,150
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,581
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75.00

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



మంగమ్మ (ఫైల్ ఫోటో)

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి చెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. మేర్లపాక ఎస్సీ కాలనీకి చెందిన కండి మంగమ్మ(65) శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి బస్సులో మేర్లపాక ఎస్సీ కాలనీ స్టేజీ వద్ద దిగింది. ఇంటికి వెళ్లేందుకు కాలినడకన రోడ్డు దాటుతుండగా వీకోట నుంచి శ్రీకాళహస్తి వైపు పూలతో వెళుతున్న లారీ అతివేగంగా వచ్చి ఆమెను ఢీకొంది. వృద్ధురాలి ముఖభాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో మంగమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పారదర్శకంగా పోలీసులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైమ్ : తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం 268 మంది పోలీసులకు బదిలీలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరితో ఎస్పీ పరమేశ్వరరెడ్డి నేరుగా మాట్లాడారు. సిబ్బంది ఆరోగ్యం, కుటుంబ సమస్యలు, కేటగిరీలను పరిగణనలోకి తీసుకుని ఖాళీల ప్రకారం వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేశారు. ఒకే పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లు మించి పనిచేసిన వారికి కౌన్సెలింగ్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, ఏఓ కిషోర్‌కుమార్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖర్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

భాకరాపేట : ప్రజారోగ్యానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఎర్రావారిపాళెం మండలం నెరబైలులో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ చంద్రగిరి నియోజక వర్గ ప్రజలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి రూ.2,950 విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా చేయించడం శుభ పరిణామన్నారు. ప్రతి ఒక్కరూ వైద్యశిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తహసీల్దార్ దస్తగిరయ్య, ఎంపీడీఓ అమర్‌నాథ్ పాల్గొన్నారు

రెండు రోజుల చిన్నారిని వదిలివెళ్ళిన తల్లి

ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో చిన్నారి



యాచకుల దగ్గర ఉన్న ఆడ శిశువు

గూడూరు: ఆడపిల్ల పుట్టిన రెండు రోజులకే ఓ తల్లి బిడ్డను వదిలించుకుంది. యాచకులు ఆ బిడ్డను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. రెండు రోజుల క్రితం ఓ మహిళ గూడూరులోని చర్చి వీధిలో యాచకుల దగ్గరకు వచ్చింది. మూత్ర విసర్జనకు వెళ్ళి వస్తానని తన బిడ్డను చూస్తుండమని వారి చేతిలో పెట్టి పోయింది. రెండు రోజులువుతున్నా ఆ తల్లి రాకపోవడంతో యాచకులు బుధవారం నేరుగా గూడూరు ఆర్డీఓ కార్యాలయం వద్దకు వెళ్ళి అక్కడ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఆర్డీఓకు తెలియజేశారు. ఆర్డీవో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు అక్కడకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. సీసీ టీవీ పుటేజిల ద్వారా బిడ్డ తల్లిని గుర్తించారు. ఆమె పట్టణానికే చెందిన మహిళ కావడంతో ఆమె వద్దకు వెళ్ళి విచారించారు. ఆమె తనకు ఇప్పటికే ఇద్దరు మగ బిడ్డలున్నారని ఆడబిడ్డను పోషించలేక ఇలా చేశానని చెప్పారు. దీంతో ఆ బిడ్డను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. వారు బిడ్డను సంరక్షిస్తూ చిన్న పిల్లల సంరక్షణ కేంద్రానికి తీసుకెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ, ఆశా బేగం, సూపర్‌వైజర్లు, కానిస్టేబుళ్లు నాగరాజు, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

నేడే 'రైతు భరోసా'

- 1,76,921 మంది ఖాతాల్లో రూ.133.48 కోట్లు జమ
- 416 మందికి రూ.32.93 లక్షల పరిహారం



వెంకటరమణారెడ్డి, కలెక్టర్

తిరుపతి అర్బన్ : అన్నదాతకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాది తొలివిడత కింద రైతు భరోసా నగదు అందించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 1,76,921 మంది రైతుల ఖాతాల్లో రూ.133.48కోట్లు జమ చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం కర్నూల్ జిల్లా పత్తికొండ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. సూళ్లూరుపేట నియోజకవర్గం తడ మండలం ఎస్‌ఆర్‌ఎం కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే అకాల వర్షాలతో పంట దెబ్బతిన్న 416 మంది రైతులకు రూ.32.93 లక్షలను పరిహారం కింద జమ చేయనున్నట్లు వెల్లడించారు.

జూపార్క్‌కు కొత్త జంతువులు

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)కు బుధవారం పది కొత్త జంతువులు వచ్చాయి. కేరళలోని త్రివేండ్రం జూ నుంచి వీటిని తీసుకొచ్చినట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. అందులో ఆరు హగ్ డీర్స్(జింకలు), నాలుగు హైనాలు ఉన్నాయని వెల్లడించారు.

మోసపూరితంగా టీడీపీ మేనిఫెస్టో



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్ : మహానాడు వేదికగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మోసపూరిత మేనిఫెస్టోని విడుదల చేశారని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం విమర్శించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పది తుప్పు పట్టిన హామీలతో ప్రకటించిన మేనిఫెస్టో పూర్తిగా చీటింగ్ చార్జిషీట్ అని ఆరోపించారు. బ్రిటిష్ హయాంలోని జలియన్‌వాలీబాగ్ ఘటనకు చంద్రబాబు పాలనలో జరిగిన బషీర్‌బాగ్ ఘటనకు తేడాలేదని స్పష్టం చేశారు. కారంచేడులో దళితుల మారణకాండ, వంగవీటి రంగా హత్య, వనజాక్షిపై దాడులు తదితర నేరాలు టీడీపీ హయాంలోనే జరిగాయని వివరించారు. నదీ పరివాహక ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చితే విధ్వంసమని విమర్శించడం అవివేకమన్నారు. కుటుంబ నియంత్రణకు మంగళం పాడేలా పదిమందిని కనండి, ప్రజలు కట్టిన పన్నులతో నేనే పోషిస్తా అని చెప్పడం విధ్వంసం కాదా అని ప్రశ్నించారు. పోలవరం నిర్మించేందుకు కేంద్రప్రభుత్వం ముందుకు వచ్చినా, కేవలం కమీషన్ల కోసం గత టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను తీసుకుని దోపిడీకి తెరతీసిందని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో 600 హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక విస్మరించిన ఘనుడు చంద్రబాబని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ఓర్వలేకే టీడీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు.

సాక్షి చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన

జిల్లా కేంద్రంలోని తపోవనం పాఠశాలలో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం శిక్షణ, పోటీలకు అనూహ్య స్పందన లభించింది. పలు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సృజనాత్మకతను చాటుతూ అద్భుత చిత్రాలను వేశారు. ఉత్తమ ప్రతిభ చాటి నలుగురు విద్యార్థులు స్ఫూర్తిగా నిలిచారు.

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ప్రతిభ చాటిన వారికి బహుమతులు
- 'సాక్షి'కి చిన్నారుల కృతజ్ఞతలు




పోటీల్లో వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చిత్రలేఖనం శిక్షకుడు రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్రలేఖనం ఊహకు రూపాన్ని ఇచ్చే చక్కని సాధనం. ఈ కళకు పరిమితులు లేవు. సహజత్వాన్ని ప్రతిబింబించే చిత్రలేఖనానికి ప్రత్యేక స్థానం ఉంది. చిత్రకారుడు సృష్టికి ప్రతి సృష్టి చేయగలడు. అటువంటి చిత్రలేఖనంలో ఎందరో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. మరెందరో అద్భుతాలను సృష్టించి ఖ్యాతి పొందారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చి విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'సాక్షి' చొరవ చూపింది. ఒక్కరోజు చిత్రలేఖనం శిక్షణ పోటీలు నిర్వహించింది. ప్రతిభ చాటిన వారికి జిల్లా బాలభవన్‌లో విధులు నిర్వహించే చిత్రలేఖన శిక్షకులు రామచంద్రారెడ్డి బహుమతులు అందజేశారు. అనంతరం బహుమతులు అందుకున్న విద్యార్థులు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ఇష్టంతో నేర్చుకుంటున్నా




నేను ఒకటవ తరగతి చదువుతున్నా. చిత్రలేఖనమంటే ఎంతో ఇష్టం. ఆ ఇష్టంతో చిత్రలేఖనం నేర్చుకుంటున్నాను. తల్లిదండ్రులు వేసవి శిక్షణకు పంపించారు. బొమ్మలు వేయడం బాగా నేర్చుకుంటున్నాను.
– సంస్కృతి, ఒకటవ తరగతి విద్యార్థిని

ప్రకృతి చిత్రాలు అంటే..



చిత్రలేఖనంలో మా నాన్నే నాకు స్ఫూర్తి. మూడేళ్లుగా నేర్చుకుంటున్నాను. పాఠశాల స్థాయిలో పోటీల్లో పాల్గొంటున్నాను. మా డ్రాయింగ్ మాస్టర్ మెలుకువలు నేర్పిస్తున్నారు. నాకు ప్రకృతి అంటే చాలా ఇష్టం. ప్రకృతిపై చాలా చిత్రాలను వేశాను. 'సాక్షి' ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది. – తేజేష్, మూడవ తరగతి

చిన్నప్పటి నుంచి అలవాటు



చిన్నప్పటి నుంచి నాకు పెయింటింగ్ వేసే అలవాటు ఉంది. క్రమంగా శిక్షణ పొందుతున్నాను. ఖాళీ సమయాల్లో బొమ్మలు వేస్తుంటాను. చాలా పోటీల్లో పాల్గొన్నాను. మాలాంటి వారిని ప్రోత్సహించేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉంది.
– రాధాకృష్ణ, 8 వ తరగతి విద్యార్థి

గ్రామీణ జీవితం ప్రతిబింబించేలా



చిన్నప్పటి నుంచి డ్రాయింగ్ అంటే ఇష్టం. ఏదైనా పండుగ, సంఘటన ప్రభావంతో సందేశాత్మక పెయింటింగ్ వేస్తాను. చిన్నతనంలో అమ్మవేసిన ముగ్గులకు రంగులు అద్దేదాన్ని. ఆధునిక చిత్రకళలో రాణించాలనుంది.
– వైష్ణవి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని

కృషి అభినందనీయం....



చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు సాక్షి పోటీలు నిర్వహించడం అభినందనీయం. చిత్రలేఖనం రెగ్యులర్ స్టడీస్‌లో రాణించేందుకు ఉపయోగపడుతుంది. చిత్రలేఖనం పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించాలి.
– రామచంద్రారెడ్డి, చిత్రలేఖనం శిక్షకుడు